క్లుప్తంగా

విద్యార్థులు బాగా చదువుకోవాలి



కళాశాలకు రెండు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న కోనాశ్రీనివాసరావు

ఉంగుటూరు: ప్రభుత్వ కళాశాలలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని, అలాగే విద్యార్థులు బాగా చదువుకొని కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కళాశాల ప్లానింగు కమిటీ సభ్యుడు కోనా శ్రీనివాస రావు అన్నారు. సోమవారం ఉంగుటూరు మండలం నారాయణపురం అరవిందశత జయంతి ప్రభుత్వ డిగ్రీకళాశాలకు రెండు ల్యాప్ టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ గతంలో కళాశాలకు లక్ష రూపాయలు అందజేశామన్నారు. సమావేశానికి కళాశాల ఇన్‌చార్జి కొండారవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై 27న పరిష్కార వేదిక

పెదపాడు: విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సీజీఆర్‌ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో పెదపాడు విద్యుత్‌శాఖ సబ్‌స్టేషన్ వద్ద ఈనెల 27న పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వై రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ బీవీ సత్యనారాయణ, మెంబరు ఫైనాన్స్ షేక్ బాబరు, టెక్నికల్ మెంబరు బీ సులేఖరాణి, ఇండిపెండెంట్ మెంబరు ఎస్ మురళీకృష్ణలతో పాటు విద్యుత్‌శాఖ ఎస్ఈ ఈ సల్మాన్‌రాజు ఈఈ అంబేద్కర్ డీఈ శ్రీనివాస్ హాజరవుతారని చెప్పారు. మండలంలోరి విద్యుత్ వినియోగదారులు ఈ పరిష్కార వేదికలో పాల్గొని తమ సమస్యలు నివృతి చేసుకోవాలని కోరారు.


బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లక్ష్మి

ఉంగుటూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్ వైజరు వి. లక్ష్మి బాలికలకు సూచించారు. సోమవారం బాల్య వివాహాలు నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ లక్ష్మి మాట్లాడుతూ మంచి ప్రవర్తనతో చదువు కొనసాగించేలా ఆలోచనలు ఉండాలన్నారు. తల్లిదండ్రులు చెప్పిన మంచి విషయాలను నేర్చుకోవాలని సూచించారు. జిల్లా కో ఆర్డినేటర్ ఆర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ బాల్యవివాహాలు ప్రోత్సహించిన వారి మీద, హాజరైన వారిమీద కఠిన చర్యలు తీసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్ వైజర్ నాగలక్ష్మి, బాలికల వసతి గృహం వెల్ఫేర్ ఆఫీసర్ మాదవి, సీహెచ్ రేఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గన్ని

గణపవరం: కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, జిల్లా తెదేపా అధ్యక్షుడు గన్నివీరాంజనేయులు అన్నారు. సోమవారం గణపవరం మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం మండల తెదేపా అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అన్నది పరిశీలించాలని, అర్హులకు పథకాల లబ్ధి అందేలా చూడాలని కోరారు. ఈసమావేశంలో తెదేపా బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి యాళ్ల సుబ్బారావు, సీనియర్ నాయకుడు కూనసాని నాగేశ్వరరావు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళలు అత్యవసర సందర్భాల్లో ఒక్క క్లిక్‌తో పోలీసులకు సమాచారం చేరేలా శక్తి యాప్ రూపొందించినట్టు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు అన్నారు. ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు సోమవారం నగరంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. యాప్ వినియోగం, ప్రాముఖ్యత, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలో వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు తమ భద్రతకు సంబంధించిన సమస్యలను భయపడకుండా, సంకోచం లేకుండా పోలీసులకు తెలియజేయాలని, శక్తి యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు, మహిళా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ఫ్లెక్సీల ఏర్పాటు

కళ్లముందే ఆదాయం కనిపిస్తున్నా...అధికారులు కనికరం చూపుతున్నారు. పంచాయతీల్లో వెలిసే ప్రచార హోర్డింగులు, ఫ్లెక్సీల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశం ఉన్న వాటివైపు ఎవరూ కన్నెత్తి చూడటం లేదు. వీటి వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యానికి ఫలితంగా ఎక్కడబడితే అక్కడ నిబంధనలకు విరుద్ధంగా ప్రచార హోర్డింగులు, ఫెక్సీలు, వ్యాపార ప్రకటనల బోర్డులు వెలుస్తున్నాయి.





గ్రామాల్లో వెలసిన ఫ్లెక్సీలు, హోర్డింగులు

- పన్ను వసూలులో అధికారుల నిర్లక్ష్యం
- నిబంధనలకు విరుద్ధంగా వెలుగుతున్న ఫ్లెక్సీలు, హోర్డింగులు
- పంచాయతీల ఆదాయానికి గండి

దెందులూరు: గతంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ప్రచార బోర్డులు, హోర్డింగ్‌లు క్రమేపీ గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. వ్యాపార సంస్థలు తక్కువ ఖర్చుతో తమ ఉత్పత్తులకు ప్రచారం చేసేందుకు గ్రామీణ రహదారుల వెంబడి ప్రజలను ఆకర్షించేలా బోర్డులను భారీసైజులో ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా పంచాయతీలు ప్రకటన న్నువసూలుకు చర్యలు తీసుకోవాలి. ఇలా వచ్చే ఆదాయంతో అభివృద్ధి పనులు చేపడుతుండాలి. కానీ ఎవరు ఎన్ని హోర్డింగులు, ఫ్లెక్సీలు పెట్టినా పంచాయతీ అధికారులు ఆటువైపు చూడడం లేదు. గతంలో వదులు 20 ఏళ్లలో ఉన్న వ్యాపార ప్రకటన బోర్డులు హోర్డింగులు ఇప్పుడు వందల్లో ఉన్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి...

ఏ ప్రాంతంలో ప్రచార బోర్డులు ఏర్పాటు చేసినా చదరపు మీటరు లెక్కన పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఇలా చేయడం వల్ల ఈబోర్డుల ద్వారా ఏటా పంచయతీలకు వేలాది రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయినప్పటికీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. దీంతో వ్యాపారులు, ఇతర సంస్థలకు చెందిన వారు ఇష్టం వచ్చినట్లు బోర్డులు ఏర్పాటు చేసుకుంటూ పోతున్నారు. దీంతో భారీగా ఆదాయానికి గండిపడుతోంది. ప్రధానంగా మండంలోని పలు ప్రాంతాలతో పాటు ఇతర గ్రామాల్లో అధికంగా ఫెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఇంత భారీ మొత్తంలో ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులు ఉన్నా వాటి నుంచి పన్నులు వసూలు చేయడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు, హోర్డింగులు

నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల వెంబడి ప్రధాన కూడళ్లలోనూ, విద్యుత్ స్తంబాలకు ఫ్లెక్సీలు, హోర్డింగులు, ప్రకటన బోర్డులు అమర్చుతున్నారు.

అనుమతులు తప్పనిసరి

ఫ్లెక్సీలు, ప్రచార బోర్డులు, హోర్డింగులు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి. అనధికారికంగా ఎవరు బోర్డులు ఏర్పాటు చేసినా తొలగిస్తాం. వినోదపు పన్ను వసూలుకు కార్యదర్శులకు ఆదేశాలిస్తాం. గ్రామ పంచాయతీలు తీర్మానాలు చేసుకుని పంచాయతీలకు ఉన్న చట్టానికి అనుగుణంగా ఆదాయం సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలి.

– పూర్ణచంద్రరావు, డీఎల్‌పీఓ, ఏలూరు



ప్రచార వాల్‌పోస్టర్లు

ప్రధానంగా పండగలు, జాతరలు, రాజకీయ నాయకులు పర్యటన సమయంలో విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ఏర్పాటు చేసే ముందు పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవడంతో పాటు ప్రచార బోర్డుల సైజుల ఆధారంగా పంచాయతీలకు పన్ను చెల్లించాల్సి ఉంది. వీటిని ఏర్పాటు చేసే స్థలం కూడా పంచాయతీలో నమోదై ఉండాలి. కానీ ఎక్కడా ఇవీ అమలు కావడం లేదు.

దళిత సేన సింహ గర్జనను విజయవంతం చేయండి

దెందులూరు: ఏలూరులో మే 5న జరగనున్న దళిత సేన సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జుజ్జవరపు రవి ప్రకాష్ అన్నారు. సోమవారం జిల్లా ప్రచారంలో భాగంగా దెందులూరులో విలేకర్లతో మాట్లాడారు. అర్హులైన డప్పు కళాకారులకు పెన్షన్ల మంజూరు ఎస్సీ, ఎస్టీ పేదలకు సాగుభూములు పట్టాల మంజూరు కోరుతూ ఏలూరులో గర్జన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని జిల్లాల నుంచి అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


30న గోవాడ అంకమ్మ తల్లి జాతర

దెందులూరు: కొవ్వలి గ్రామ దేవత గోవాడ అంకమ్మ తల్లి జాతర మహోత్సవం ఈ నెల 30వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా అంకమ్మ తల్లి జాతర జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ గోవాడ నాగరాజు తెలిపారు. ఉత్సవాలు సందర్భంగా వందలాది మంది భక్తుల ఆధ్వర్యంలో గోవాడ అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ఉగాది జాతర కార్యక్రమాన్ని చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్ 2న వేలాదిమందికి గోవాడ అంకమ్మ తల్లి ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కొవ్వలి గోవాడ అంకమ్మ తల్లి జాతర ఉత్సవ కమిటీ సెక్రటరీ గోవాడ శ్రీను, వైస్ ప్రెసిడెంట్ శీలం అప్పారావు, క్యాషియర్ గుల్లపూడి రమేష్, సభ్యులు గోవాటి దుర్గారావు, గోవాడ సాంబ, కొల్లూరు సాయి తెలిపారు.

క్షయ నివారణకు సమష్టి కృషి



పీఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శన



క్షయ రోగులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

గణపవరం: క్షయ వ్యాధిని సమాజం నుంచి పూర్తిగా తొలగించడానికి అందరి సమష్టి కృషి అవసరమని గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి, జిల్లా పీఎంపి అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు అన్నారు. సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా క్షయవ్యాధిపై అవగాహన సదస్సులు, ప్రదర్శనలు నిర్వహించారు. క్షయవ్యాధి పూర్తిగా నివారించగల వ్యాధి అని, సకాలంలో వైద్యసహాయం పొందకపోవడం వల్లనే క్షయ వ్యాధి ప్రాణాంతకంగా మారుతుందన్నారు. గణపవరం పీహెచ్‌సీలో నిర్వహించిన క్షయవ్యాధి అవగాహన కార్యక్రమంలో వైద్యాధికారిణి పి.కిరణ్మయి మాట్లాడుతూ మూడు అంతకాన్నా ఎక్కువ కాలం దగ్గు ఉండటం, రక్తం లేదా శ్లేష్మంతో కూడిన దగ్గు, ఛాతీనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, బరువుతగ్గడం, అలసట, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, చలితో కూడిన వణుకు తదితర లక్షణాలు ఉంటే క్షయవ్యాదిగా అనుమానించాలని సూచించారు. క్షయవ్యాధి ఉన్న వారు ఇంటిపట్టునే ఉండాలని, తప్పనిసరిగా మాస్క్ ధరించాలన్నారు. పీహెచ్‌సీలో క్షయకు ఉచిత పరీక్షలు, మందులు ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా క్షయవ్యాధిపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల పిఎంపి అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి, పిఎంపి సభ్యులు శివశ్రీనివాసరావు, అప్పారావు, పానకాలు, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజ స్థాపనలో భాగస్వాములు కావాలి

భీమడోలు: క్షయ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు, గుండుగొలను, పోలసానిపల్లి గ్రామాల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో సోమవారం ఆయన పాల్గొని ప్రారంభించారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ దినోత్సవాన్ని కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, సర్పంచ్‌లు షేక్ రహీమాబేగం, కూర్మా లక్ష్మి, టీబీ సూపర్‌వైజర్ తోట మనోజ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, మండల నాయకులు ప్రత్తిమదన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యులు ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, వాసు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెదపాడులో న్యాయవిజ్ఞాన సదస్సు

పెదపాడు: సమాజంలో జరిగే హత్యాచార ఘటనలను ఎదుర్కొనే విధానాన్ని విద్యార్థులకు అధికారులు తెలియజేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలంలోని కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట న్యాయసేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. సునీల్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు సమాజంలో ఎదురయ్యే సమస్యలు వాటి వల్ల కలిగే అనర్థాలు, వాటిని పరిష్కరించుకునే విధానంపై అవగాహప కల్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఎప్పటికప్పుడు చైతన్య పరచాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏలూరు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వీఎస్ఎస్ లక్ష్మీ లావణ్య, తణుకు మొదటి అదనపు జూనియర సివిల్ జడ్జి పివి నాగ రంజిత్‌కుమార్, ఎఎల్‌ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, పాఠశాల ప్రదానోపాధ్యాయులు భీమయ్య పాల్గొన్నారు.

కొమిరేపల్లిలో కానరాని ఉపాధి పనులు

దెందులూరు: మండలంలోని కొమిరేపల్లి శివారులో ఉపాధి పనులు పెట్టకపోవడంపై దళితులు మాల మహాసేన జిల్లా కార్యదర్శి గంటా పండు ఆవేదన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పంచాయతీలో శింగవరం, సీతంపేట గ్రామాలకు ఉపాధి పనులు పెట్టి పూర్తిగా దళితులు ఉన్న కొమిరేపల్లి శివారుకు ఉపాధి పనులు ఎందుకు ఇవ్వటంలేదని ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అడిగినవారికి ఉపాధి పనులు కల్పించండి వలసలు నిరోధించాలని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ నిధులు ఆదేశాలిస్తుంటే అందుకు విరుద్ధంగా కొమిరేపల్లిలో జరగటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పూర్తిగా దళితులు ఉన్న కొమిరేపల్లి గ్రామంలో ఉపాధి పనులు పెట్టకపోవడంపై మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్, మాల మహాసేన జిల్లా కార్యదర్శి గంటా పండు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి ఉద్యోగులు అధికారుల తీరుమార్చుకోవాలని వివక్షత విధానం కొనసాగితే పరిణామాలు వేరేగా ఉంటాయని నాయకులు అన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ వివరణ

కొమిరేపల్లి శివారులో ఉపాధి పనులు పెట్టని సంగతి వాస్తవమేనని ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్ అన్నారు. గ్రామస్తులు ఎవరు తనను అడగలేదన్నారు. సీతంపేట శింగవరం గ్రామంలో ఉపాధి పనులు పెట్టామన్నారు.

ఉపాధి రుణాలకు గడువు పెంపు

గణపవరం: వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 25వ తేదీ వరకూ పెంచినట్లు గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి తెలిపారు. వాస్తవానికి గడువు ఈనెల 22వ తేదీతో ముగియగా మరో మూడు రోజులు ప్రభుత్వం పెంచిందని 25వతేదీ మంగళవారంతో గడువు ముగుస్తుందన్నారు. 2024–25వ సంవత్సరం బీసీ, ఓబిసి, బ్రాహ్మణ, కాపు, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య మొత్తం 7 కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఆటోవ్యాన్‌లు, గొర్రెలు, మేకల పెంపకం, మినీ డైరీ, ట్రాక్టర్లు, సిమెంట్ బ్రిక్స్ తయారీ, చేపల అమ్మకం, బంగారు దుకాణం, గ్రానైటు, మార్బుల్, పాలిషింగ్, బియ్యం, ఫోటో స్టూడియో, బేకరీ వంటి 52 రకాల వ్యాపారాలలో దేనికైనా దరఖాస్తు చేసుకోవచ్చునని, ఒక్కోయూనిట్‌కు అయ్యే ఖర్చులో 50 శాతం ప్రభుత్వం, మరో 50శాతం బ్యాంకు ద్వారా రుణం పొందే అవకాశం ఉంటుందన్నారు. అర్హులైన వారు గ్రామ సచివాలయం, మీసేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో మంగళవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిత్తశుద్ధి ఉంటే షాదీ ముబారక్ ఇవ్వండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముస్లింలకు కంటితుడుపు చర్యగా ఇస్తున్న ఇఫ్తార్ విందులు అవసరం లేదని, ముస్లిం యువతుల వివాహాలకు ఉపయోగపడే షాదీ ముబారక్ ఇవ్వాలని సామాజిక కార్యకర్త ఎండీ ఇస్మాయిల్ షరీఫ్ ఒక ప్రకటనలో కోరారు. టీడీపీ ప్రభుత్వం గతంలో ప్రవేశ పెట్టిన తాళిబొట్టు, పెళ్లి కానుక, షాదీ ముబారక్ పథకాలను ప్రస్తుతం తానే తుంగలో తొక్కడం తిరోగమనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పథకాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి అమలు చేసి పేదల ఇంట ఆడపిల్లల పెళ్లికి సహకరించేదని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా ఏదో ఒక సాకు చూపి వేలాది పింఛన్లు తొలగించి పేదల, వికలాంగుల కడుపుకొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోకో గింజలకు గిట్టుబాటు ధర కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోకో రైతులు

దెందులూరు: కోకో గింజలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని సోమవారం దెందులూరు తహసీల్దార్ బీ.సుమతికి కోకో రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కోకో పంట సాగు చేసిన రైతుల జీవన విధానం ఉత్పత్తి మార్కెట్ ధర రవాణా ఇతర అన్ని పరిస్థితులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోకో రైతులకు న్యాయం చేయాలని నాయకులు సింహాద్రి సత్యనారాయణ, నల్లూరి సత్యనారాయణ, దేవరపల్లి శ్రీనివాసరావు కోరారు.

కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలి

పెదవేగి: కోకో రైతుల వద్ద ఉన్న ఆన్ సీజన్ కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో పెదవేగి మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం కోకో రైతులు ధర్నా నిర్వహించారు. కోకో రైతులను ప్రభుత్వం ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ ధర్నాకు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆయిల్ పామ్ రైతు సంఘం అధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షుడు మున్నంగి సుబ్బారెడ్డి మాట్లాడారు. ఈ సంవత్సరం కోకో రైతులకు తగిన ధర రాక, కంపెనీలు గింజలు కొనుగోలు చేయక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోకో తోటలు కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కోకో గింజలు పచ్చళ్ల పట్టుకోండి అంటూ కొన్ని కంపెనీల ప్రతినిధులు రైతులను ఎగతాళి చేస్తూ రైతులను అవమానించడం దారుణమని విమర్శించారు. గత నెల రోజులుగా రోడ్డెక్కి కోకో రైతులు ఆందోళన చేస్తున్నారని అయినా కంపెనీలనుంచి తగిన స్పందన లేదని, ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ సమక్షంలో కంపెనీలతో జాయింట్ మీటింగ్ జరిగినా కోకో గింజలు కొనుగోలు సమస్య పరిష్కారం రాలేదని చెప్పారు. ఒక్క పెదవేగి మండలంలోనే అన్ సీజన్ కోకో గింజలు 500 టన్నులకు పైగా రైతులు వద్ద నిల్వ ఉండిపోయాయని చెప్పారు. ఆన్ సీజన్ కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల తహసీల్దార్ బ్రమరాంబకు, మండల ఉద్యాన శాఖ అధికారికి వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కోనేరు సతీష్ బాబు, కోకో రైతులు బొప్పన పూర్ణచంద్రరావు, ఆర్.తేజకృష్ణ, జగన్మోహనరావు, వై.లలితా కుమార్, కె.రామిరెడ్డి, జి.లక్ష్మణరావు, పి. ప్రభాకరరావు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో చలివేంద్రాలు

దెందులూరు: మండలంలో అన్ని గ్రామాల్లో వీఆర్‌ఓలు, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి అన్నారు. సోమవారం దెందులూరు వీరమాచినేని పుష్ప కల్యాణ్ మండపంలో దాత వీరమాచినేని శివాజీ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా దాత శివాజీ మజ్జిగ చలివేంద్రాన్ని ప్రతి ఏటా వేసవిలో నిర్వహిస్తున్నారని దాత సేవాగుణాన్ని తహసీల్దార్ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థినులకు ఉద్యోగాలు



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాల కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో సోమవారం రాజమండ్రికి చెందిన అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్ సంస్థ సహకారంతో హైదరాబాద్‌కు చెందిన ఎన్ఎస్ఐటీ సంస్థ ప్రతినిధులు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎన్ఎస్ఐటీ సంస్థ బిజినెస్ హెడ్ జె.కల్యాణి, సేల్స్ హెడ్ ఎ.వంశి, టి.సాయిరాం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న 110 మందికి తొలుత గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి 40 మందిని ఎంపిక చేశారు. వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి 22 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ జి.సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.ఝాన్సీలక్ష్మి, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ప్రతినిధి జీఎస్ఆర్ కల్యాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలీస్ స్కూల్‌కు కంప్యూటర్ల వితరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు నగరానికి చెందిన పారిశ్రామికవేత్త కేకే గుప్తా ఎనిమిది కంప్యూటర్లను అందజేశారు. కేకే గుప్తా ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ కంప్యూటర్లను సోమవారం ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేకే గుప్తా సేవా దృక్పథం విద్యార్థులకు నూతన సాంకేతికతను నేర్చుకునే అవకాశాన్ని అందించి, వారి భవిష్యత్తును మెరుగుపరిచేలా చేయడంలో సహాయపడుతుందని అన్నారు. ఈ కంప్యూటర్ల ద్వారా విద్యార్థులకు డిజిటల్ విద్యను మరింత చేరువ చేస్తామని తెలిపారు. ఇలాంటి మహోన్నత సేవా కార్యక్రమాలకు మరింత మంది ముందుకు రావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర రావు, డీఎస్పీ రెడ్డి శ్రవణ్ కుమార్, ఏఆర్ ఆర్ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు.

కరాటేతో మానసిక ఉల్లాసం



భీమడోలులో కరాటే విద్యార్థులను సన్మానిస్తున్న ఎస్సై వై.సుధాకర్

భీమడోలు: మానసిక ఉల్లాసానికి కరాటే ఎంతగానో దోహద పడుతుందని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలులోని మాంటిస్సోరి విద్యాసంస్థల కార్యాలయంలో మంగళవారం జపాన్ షొటోకాన్ కరాటే డుకనింజాకు ఇండియా ఆర్గనైజేషన్ పర్యవేక్షణుడు డీఎల్ నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల కలర్ బెల్ట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభను చాటిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆర్.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన ఎస్సై వై.సుధాకర్ మాట్లాడుతూ స్వీయరక్షణ, మహిళల ఆత్మ రక్షణకు ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచి కరాటే నైపుణ్యాలను సాధించాలన్నారు. నేటి సమాజంలో చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు తమ పిల్లలకు కరాటే, మార్షల్ ఆర్ట్స్ వంటి నైపుణ్యాలను నేర్పాలన్నారు. బ్లాక్ బెల్ట్ సాధించిన మానస ఈఎం స్కూల్ విద్యార్థి కామన సాయి బాబాను ఘనంగా సత్కరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభను చాటిన విద్యార్థులకు బెల్ట్‌లు, ప్రశంసా పత్రాలను అందించారు. ట్రైనర్ ఎం.సతీష్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి పెనుమూడి బాబు, అధ్యాపకులు ఏ.శ్రీనివాసరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం.. ఆగాల్సిందే చూడు!

రోజురోజుకూ జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య



నారాయణపురం సెంటర్లో ట్రాఫిక్ సమస్యను చక్కదిద్దుతున్నపోలీసులు

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురంలో ట్రాఫిక్ సమస్య నానాటికీ జఠిలమవుతోంది. ఈ రహదారిపై నిత్యం సుమారు 10వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. పలు చోట్ల రహదారి ఇరుకుగా ఉంద. ఫలితంగా ట్రాఫిక్ కష్టాలు ఉత్పన్నమవుతున్నాయి. నారాయణపురం దాటాలంటే ఆగి ఆగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటు వాహన చోదకులు, గ్రామస్తులు నిత్యం అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఇరుకు రోడ్డుతో...

ఇరుకు వంతెన కావడం, అక్కడే మలుపు ఉండటం, పక్కనే ఆక్రమణలు ఉండటంతో తరుచూ నారాయణపురంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది. జాతీయరహదారి మీదుగా వెళ్లే వాహనాలు ఓవైపు, భీమవరం వెళ్లే వాహనాలు మరోవైపు తిరుగుతుండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. చేబ్రోలు పోలీసులుకు ఈట్రాఫిక్ సమస్య పరిష్కరించడం పెద్ద సమస్యగా మారింది.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి



వెంకటాపురంలో కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): రైతులు రసాయన వ్యవసాయాన్ని మాని, ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ సంయుక్త డైరెక్టర్ ఎస్‌కే హబీబ్ బాషా, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేష్‌లు సూచించారు. సోమవారం ఏలూరు మండలం వెంకటాపురం గ్రామంలో ప్రీ మోన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పీఎండీఎస్ పద్ధతులు పాటించడం వల్ల వచ్చే 14 రకాల లాభాలను వివరించారు. రసాయన వ్యవసాయ విధానాలను వదిలి ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలని అన్నారు. ఈ మార్పు మట్టిలో పర్యావరణ స్నేహితమైన పౌష్టికతను పెంచి, రైతులకు మంచి దిగుబడులు, పురుగులు, ఔషధ వృక్షాలు సమస్యలను నివారించడంలో సహాయపడతుందని వివరించారు. కార్యక్రమంలో 15 వేల పీఎండీఎస్ కిట్‌లను పంపిణీ చేశారు. రైతులు పాల్గొన్నారు.